హరీశ్‌రావుపై ఫోన్‌ట్యాపింగ్ కేసు రద్దు

అభియోగాలకు ఎలాంటి ఆధారాలు లేవు: హైకోర్టు

- **మరో కేసులో ఇచ్చిన వాంగ్మూలాన్నే ఫిర్యాదుగా మార్చి ఇచ్చారు**
- **హరీశ్‌తో చక్రధర్‌గౌడ్‌కు రాజకీయ శత్రుత్వం ఉన్నట్టు కనిపిస్తున్నది**
- **ఫిర్యాదు చేయడంలో అసాధారణ్య జాప్యం: హైకోర్టు**



హైదరాబాద్ మార్చి 20 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టీ హరీశ్‌రావుపై పంజాగుట్ట పోలీసులు నమోదుచేసిన ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టివేసింది. హరీశ్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నాయకుడు చక్రధర్‌గౌడ్ తగిన ఆధారాలను చూపలేదని పేర్కొంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ గురువారం 36 పేజీల తీర్పును వెలువరించారు. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపిస్తూ చక్రధర్‌గౌడ్ చేసిన ఫిర్యాదుపై టీ హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు మీద పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ముగించిన హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. 'హరీశ్‌రావు, రాధాకిషన్‌రావుపై నమోదైన కేసులో అభియోగాలకు తగిన ఆధారాలు లేవు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీచేసిన హరీశ్‌రావు, చక్రధర్‌గౌడ్ మధ్య రాజకీయ శత్రుత్వం కనిపిస్తున్నది. దీనికి తోడు ఫిర్యాదు చేయడంలో అసాధారణ జాప్యం జరిగింది. ఇందుకు కారణాలు ఎక్కడా లేవు. డీజీపీకి ఇచ్చిన ఫిర్యాదులోగానీ, హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో గాని ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు పేర్కొనలేదు. ఈ నేపథ్యంలో పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ చెల్లదు' అని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది.

పంజాగుట్ట పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలన్న హరీశ్, రాధాకిషన్‌రావు విజ్ఞప్తికి కోర్టు సమ్మతించింది. చక్రధర్‌గౌడ్ సెప్టెంబర్ ఒకటిన పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పిటిషనర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడినట్టుగానీ, ప్రజాప్రతినిధిగా విశ్వాసఘాతుకానికి పాల్పడినట్టుగానీ, నేరపూరిత బెదిరింపులకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు చేయలేదని గుర్తుచేసింది. ఐటీ చట్టంలోని సెక్షన్ కింద ఫిర్యాదులో ఎలాంటి ఆరోపణలు లేవని తెలిపింది. డీజీపీకి గత ఏడాది జూన్ 18న చక్రధర్ ఇచ్చిన వినతిపత్రంలోగానీ, గత ఏడాది ఇదే హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లోగానీ, డిసెంబర్ ఒకటిన పంజాగుట్ట పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులోగాని దోపిడీ, బెదిరింపులు, నమ్మకద్రోహం, నేరపూరిత చర్యలకు సంబంధించి ఎలాంటి ఆరోపణలు చేయలేదని గుర్తుచేసింది. ఆరోపణలన్నీ పూర్తిగా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించినవేనని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఐపీసీ సెక్షన్ 386 కింద ఎఫ్ఐఆర్ నమోదుకు వీల్లేదని స్పష్టంచేసింది.

ఆలస్యానికి కారణాలు లేనేలేవు

చక్రధర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో జరిగిన ఆలస్యానికి కారణాలు ఎక్కడా పేర్కొనలేదు. 2023 ఆగస్టులో ఆపిల్ ఫోన్ కంపెనీ నుంచి ఫోన్ ట్యాపింగ్ అవుతున్నదని మెసేజ్ వచ్చిందని 2024లో డీజీపీకి వినతిపత్రం ఇచ్చారు. అదే ఏడాది డిసెంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు 2023లో మెసేజ్ వస్తే 2024 డిసెంబర్ వరకు ఎందుకు ఫిర్యాదు చేయలేదో వివరించలేదు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్నందున, ఆయనకు రాధాకిషన్‌రావు సన్నిహితుడిగా ఉన్నందున భయపడి ఫిర్యాదు చేయలేదని అనుకుంటే.. 2023 డిసెంబర్‌లోనే హరీశ్ మంత్రిగా ఉన్న ప్రభుత్వం మారిపోయింది. కొత్త ప్రభుత్వం వచ్చాక అంటే 2023 డిసెంబర్లో చక్రధర్ గౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేసి ఉండవచ్చు అని కోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేసు కొనసాగింపునకు అనుమతిస్తే న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేసినట్టు అవుతుంది. కాబట్టి పంజాగుట్ట పోలీసులు పెట్టిన కేసుకు చట్టబద్ధత లేదు.. అని తీర్పు వెలువరించింది. హరీశ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు, న్యాయవాది ఆర్ చంద్రశేఖర్‌రెడ్డి, పోలీసుల తరఫున పీపీ పల్లె నాగేశ్వరరావు వాదనలు వినిపించారు.

వాంగ్మూలంలోని విషయాలతోనే ఫిర్యాదు

'ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయిన రాధాకిషన్‌రావు 2023 ఆగస్టు నుంచి ఈ ఏడాది జనవరి 30 వరకు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ఆ కేసు దర్యాప్తు పూర్తి కావడమే కాకుండా చార్జిషీట్ కూడా దాఖలైంది. ఆ కేసులో 60వ సాక్షిగా ఉన్న చక్రధర్‌గౌడ్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. అందులో చెప్పిన విషయాలతోనే పంజాగుట్ట పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. చక్రధర్‌గౌడ్‌ను పలు కేసుల్లో అరెస్ట్ చేసినట్టు పోలీసులు తమ కౌంటర్‌లో పేర్కొన్నారు. ఆయా కేసుల్లో చక్రధర్‌ను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినప్పుడు రాధాకిషన్‌రావు వేధించినట్టు కింది కోర్టులో చెప్పలేదు. కాబట్టి చక్రధర్‌గౌడ్ తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటూ పంజాగుట్ట పోలీసులకు చేసిన ఫిర్యాదులోని అభియోగాలకు ఆధారాలు లేవు. కాబట్టి ఐపీసీ సెక్షన్లు 386, 409, 506, ఐటీ చట్టంలోని 66 కింద ఎఫ్ఐఆర్‌ను కొనసాగించేందుకు ఆస్కారం లేదు' అని హైకోర్టు తన తీర్పులో వివరించింది.

కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే దాడులా?

- **సీఎంఆర్ఎఫ్ దుర్వినియోగం నిజమే**
- **చిల్లర రాజకీయాలు మానుకోవాలి**
- **మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

మానకొండూర్, మార్చి 20 : బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే పదవిలో ఉన్న కవ్వంపల్లి సత్యనారాయణ చిల్లర రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హితవు పలికారు. బుధవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు రామకృష్ణారావు, తోట ఆగయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమస్యలు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల దుర్వినియోగంపై మాట్లాడితే ఎమ్మెల్యే కవ్వంపల్లి తన అనుచరులతో దాడులు చేయిస్తాడా? ఇదేనా ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే దాకా ప్రజల గొంతుకనై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గత పదేళ్లుగా పచ్చని పొలాలు, పంటలతో అన్నపూర్ణ నియోజకవర్గంగా పిలువబడిన మానకొండూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కవ్వంపల్లి అసమర్థ పాలనతో నేడు సాగునీరులేక అల్లాడుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గం చుట్టూ మిడ్ మానేరు, ఎల్ఎండీ, తోటపల్లి, అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లలో పుష్కలంగా నీరున్నా సాగుకోసం అందివ్వని అసమర్థ నాయకుడు కవ్వంపల్లి అని విమర్శించారు. పెద్దలింగాపూర్ రైతులు సాగునీటి కోసం ధర్నా చేస్తుంటే కనీసం వారి సమస్యను పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. పదేండ్లలో మానకొండూర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరుగలేదని అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే కవ్వంపల్లి అబద్ధాలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. 15 నెలల్లో నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయన్నా తీసుకువచ్చావా? అని నిలదీశారు. అనంతరం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి కవ్వంపల్లికి జ్ఞానోదయం కలిగించాలని వినతిపత్రం ఇచ్చారు.

తక్షణమే 42% రిజర్వేషన్ అమలుచేయాలి

- **స్థానిక ఎన్నికల్లో అమలు చేయాలి**
- **విద్యా, ఉద్యోగాల్లో వర్తింపజేయాలి**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద యాక్టర్**
- **బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ ఆగ్రహం**

హైదరాబాద్, మార్చి20 (నమస్తే తెలంగాణ)/ ఖైరతాబాద్: రాష్ట్రంలో బీసీలకు 42% రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన లెక్కల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో ఈ రిజర్వేషన్లను వర్తింపజేయాలని కోరారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వివిధ బీసీ కులసంఘాల నేతలతో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రంపై నెపం మోపి తప్పించుకోవాలని చూస్తే ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 9వ షెడ్యూల్‌లో చేర్చితే 42% రిజర్వేషన్ చట్టానికి రక్షణ కలుగుతుందనుకోవడం మూర్ఖత్వమేనని వెల్లడించారు. సినిమా నటులకంటే సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద యాక్టర్ అని, రిజర్వేషన్ల కోసం ఢిల్లీ పోదామంటూ ఆయన చేస్తున్న యాక్టింగ్‌ను మానుకోవాలని హితవు పలికారు. బీసీలను మోసగించేందుకే 9వ షెడ్యూల్ డ్రామా అని విమర్శించారు.

వచ్చే నెల 12న వేలాది మందితో ధర్నా

29వ జీవో తెచ్చి బీసీ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిన రేవంత్‌రెడ్డి.. రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లలో 42% బీసీ రిజర్వేషన్లను అమలుచేసి తన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని, లేదంటే మరో ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ నెల 27న బీసీ మేధావులు, కులసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని, ఏప్రిల్ 12న వేలాది మందితో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. సమావేశంలో బీసీ హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధేశ్వరులు, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు రేవంత్ సర్కార్‌కు చెంపపెట్టు

- **రాజకీయ కక్షతోనే హరీశ్‌రావుపై కేసు**
- **ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్**

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి హరీశ్‌రావుపై నమోదైన ఫోన్‌ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టివేయడం రేవంత్ సర్కార్‌కు చెంపపెట్టు లాంటిదని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. రాజకీయ కక్షతో హరీశ్‌రావుపై అక్రమంగా కేసు పెట్టారని హైకోర్టు తీర్పుతో తేటతెల్లమైందని శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతులను నొక్కేస్తూ.. ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు బనాయిస్తున్న రేవంత్ సర్కారు ఇప్పటికైనా బుద్ధితెచ్చుకోవాలని ఆయన సూచించారు. హరీశ్‌రావును ఎంత అణచాలని చూస్తే.. అంత ఎత్తుకు ఎదుగుతారు తప్ప.. ప్రజాసమస్యల పోరాటంలో రాజీపడరని స్పష్టంచేశారు. ఇప్పటికైనా ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు చర్యలు మానుకుని.. పాలనపై దృష్టిసారించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే తుది న్యాయాధిపతులు అని.. అక్రమాలు, కక్షసాధింపు పాలనను ఎప్పటికీ సమర్థించరని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి బురదజల్లే రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.



ఈ రెండూ రివర్స్ అయితే తప్ప నీకు కొనిస్తానన్న బంగారం కొనివ్వలేనమ్మా!

రైతులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదు

- **రామాయి సిమెంటు పరిశ్రమపై రైతుల ఆగ్రహం**
- **బందోబస్తు మధ్య పర్యావరణ అభిప్రాయ సేకరణ**

ఆదిలాబాద్, మార్చి 20(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా రామాయిలో ప్రారంభించనున్న సిమెంటు పరిశ్రమతో భూములు కోల్పోయిన వారికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పరిశ్రమ ఏర్పాటులో భాగంగా భారీ పోలీసు బందోబస్తు పర్యావరణ అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, పర్యావరణ శాఖ ఇంజినీర్ లక్ష్మణ్‌రావుతోపాటు సాత్నాల మండలంలోని రామాయి, యాపల్‌గూడ, అడ్డగుట్ట, సోనేరావు గూడకు చెందిన రైతులు పాల్గొని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా వ్యవసాయం చేసుకుంటూ జీవించే రైతులు ఉపాధి కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఎకరం ధర రూ.40 లక్షల వరకు ఉందని, పరిహారం అందిన తర్వాతనే పనులు ప్రారంభించాలని సూచించారు. పరిశ్రమకు రోడ్డు ఎక్కడి నుంచి ఏర్పాటు చేస్తారో, పరిశ్రమ కాలుష్యం వల్ల వేలాది ఎకరాలకు సాగునీరు అందించే సాత్నాల ప్రాజెక్టు భవిష్యత్? బ్లాస్టింగ్ కారణంగా ఇబ్బందులపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇసుక ధరల పెంపుతో ప్రజలపై భారం

- **బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ మండిపాటు**

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఇసుక ఆదాయం పెరిగిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పేవన్నీ అబద్ధాలేనని, ఇసుక ధరలు పెంచి ఆదాయం పెరిగిందనడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు. ప్రభుత్వం ఇసుక ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచి ప్రజలపై భారం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఇసుక ఆదాయం పెరిగిందంటూ సీఎం చేసిన ప్రకటనను ఆయన ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో జీఎస్టీ, రవాణా చార్జీలు కలిపి టన్ను ఇసుక రూ.1200లకే లభించగా, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో జీఎస్టీ, రవాణా కాకుండానే రూ.1800లకు పెంచినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఆదాయం సేకరిస్తున్నట్టయితే వార్షిక లక్ష్యం రూ.800 కోట్లుగానే ఎందుకు మిగిలిపోయిందని ప్రశ్నించారు.

ఆత్మహత్యలు చేసుకోవద్దు

విద్యార్థులకు ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి వర్షిణి సూచన

హైదరాబాద్, మార్చి20 (నమస్తే తెలంగాణ): విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, తల్లిదండ్రులకు కడుపుకోత మిగల్చవద్దని ఎస్సీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వర్షిణి సూచించారు. సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావని చెప్పారు. టీచర్లకు మ్యాజిక్ ఆఫ్ చేంజ్ సంస్థతో కలిసి ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఎంసీ హెచ్ఆర్డీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'మ్యాజిక్ ఆఫ్ చేంజ్'' సంస్థ వ్యవస్థాపకుడు మహమ్మద్ రఫీ ఉపాధ్యాయులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యదర్శి వర్షిణి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. విద్యార్థులు మానసికంగా ధృడంగా ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని కోరారు.

సామాన్యులు, పాలకులూ దుర్భాషలొద్దు!

- **వ్యక్తిగత, కుటుంబ ప్రతిష్ఠలకు భంగం కలిగించొద్దు**
- **రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆందోళన**

ఖైరతాబాద్, మార్చి 20: ముఖ్యమంత్రి సహా బాధ్యతాయుతమైన కీలక పదవుల్లో ఉన్నవారు, ఇటు సామాన్యులు దుర్భాషలాడొద్దని పలువురు వక్తలు హితవు పలికారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిగ్నల్ టీవీ సీఈవో శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. 'ప్రభుత్వ పాలన- ప్రజల స్పందన- మీడియా తీరు' అన్న అంశంపై జరిగిన సమావేశంలో పాల్గొన్న వక్తలు కీలక పదవుల్లో ఉన్న వారు అన్‌పార్లమెంటరీ లాంగ్వేజ్‌ను విడనాడాలని కోరారు. కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మిన ప్రజలు ఎన్నో ఆశలతో ఓట్లేశారని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలైనా హామీలు అమలుకాకపోవడం వల్ల సామాన్యులు అసహనంతో పాలకపక్షంపై తీవ్రమైన భాషను ఉపయోగిస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కాంత్రికిరణ్ మాట్లాడుతూ అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహాన్ని తప్పుబట్టడం సరికాదని సూచించారు. గబీజేపీ అధికార ప్రతినిధి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వాన్ని తిడుతున్నప్పుడు.. ప్రభుత్వ పెద్దలు ఆత్మవిమర్శ చేసుకొని సరిదిద్దుకోవాలని, జర్నలిస్టులపై తమ ప్రతాపాన్ని చూపించడం వల్ల ప్రయోజనం ఉండదని సూచించారు. సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న మాట్లాడుతూ రాజకీయ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, మీడియాకు స్వీయ నియంత్రణ ఉండాలని చెప్పారు.

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మొండిగౌరెల్లి రైతులు

సారూ..మా భూములు తీసుకోవద్దు

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి మొండిగౌరెల్లి గ్రామస్తుల వినతి

యాచారం, మార్చి 20: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లికి చెందిన రైతులు పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం తమ భూములను తీసుకోవద్దని రెండురోజుల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి, యాచారం తహసీల్దార్ అయ్యప్పకు భూములు తీసుకోవద్దని వినతి పత్రం ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం గ్రామానికి చెందిన నాయకులు బండిమీది కృష్ణ, తాండ్ర రవీందర్ రైతులతో కలిసి రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 'సారూ..మాభూములను తీసుకోవద్దు, పారిశ్రామిక వాడ కోసం చేపట్టనున్న భూ సేకరణ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి' అని విన్నవించారు. సాగు చేసుకొని జీవనోపాధి పొందుతున్న దళితులు, పేదల భూములను పరిశ్రమల కోసం బలవంతంగా సేకరిస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. పచ్చని పొలాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేయొద్దని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా సెంటు భూమిని కూడా వదులుకునేదిలేదని రైతులు స్పష్టం చేశారు. సమస్యను అధిష్ఠానం దృష్టికి తీసుకుపోయి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని కోదండరెడ్డి హామీ ఇచ్చినట్టు రైతులు పేర్కొన్నారు.

ఫ్యూచర్ సిటీలో ఇన్‌సైడర్ ట్రేడింగ్!

- **ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా గెలువలేదని హైదరాబాద్‌పై కక్ష గడుతరా?**
- **సూపర్ స్పెషాలిటీ దవాఖానలనూ పట్టించుకోరా?**
- **బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే వివేకానంద**

హైదరాబాద్, మార్చి 20, (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ పేరిట ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరుగుతున్నదని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు చూస్తే చేసింది గోరంత.. చెప్పుకొనేది కొండంత అన్న తీరుగా ఉన్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క సీటు కూడా రాలేదన్న కోపంతో బడ్జెట్‌లో హైదరాబాద్‌కు నిధులివ్వకుండా ప్రభుత్వం కక్షకట్టిందని తెలిపారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ పేరిట ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరుగుతున్నదని, దీని వెనుక ఎవరున్నారన్న విషయం అందరికీ తెలుసునని చెప్పారు. ఫోర్త్‌సిటీలో స్పోర్ట్‌సిటీ, స్కిల్ ఇండియా అంటూ హంగామా చేస్తున్న ప్రభుత్వం అక్కడ కూడా భూదందాకు తెరలేపిందని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి 60 శాతం ఆదాయాన్ని సమకూరుస్తున్న హైదరాబాద్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో మహానగరం అభివృద్ధికి పెద్దపీట వేసి, మౌలిక వసతులు కల్పించి దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపామని గుర్తుచేశారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా నాడు (బీఆర్ఎస్ హయాంలో) ప్రారంభించిన నాలుగు సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయడంలో ప్రభుత్వం విఫలమైందని వివేకానంద విమర్శించారు. మెట్రో-2, 3 ఫేస్ విస్తరణకు గతంలో కేటాయించిన నిధులనే విడుదల చేయకపోవడంతో ఓల్డ్ సిటీలో పనులు నత్తనడకన సాగుతున్నాయని వెల్లడించారు. రాయదుర్గం- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో పనులను కొనసాగించకుండా కేంద్ర నిధుల కోసం ఎదురుచూడడం విడ్డూరంగా ఉన్నదని తెలిపారు.

దేనిపైనా ప్రభుత్వానికి స్పష్టత లేదు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా చేసిన అభివృద్ధి మాత్రం ఏమీలేదని, భవిష్యత్‌లో చేయబోయే పనులపై స్పష్టత లేదని వివేకానంద దుయ్యబట్టారు. గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండానే మళ్లీ కేటాయింపులు జరిపి అంకెలగారడీ చేసిందని చెప్పారు. కేసీఆర్ పాలనలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్లపై అసత్యాలు చెబుతున్నదని ఆక్షేపించారు. లక్ష ఇండ్లకు ప్రణాళికలు రూపొందించి 90 వేల ఇండ్లు నిర్మించి, 70 వేల ఇండ్లను పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు మాత్రం గత ఏడాది 3,000 ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికి ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను కాపాడామని వివేకానంద చెప్పారు. కానీ ప్రస్తుత సర్కారు మాత్రం సీసీ కెమెరాల నిర్వహణలో విఫలంకావడంతో శాంతిభద్రతలు అదుపు తప్పి క్రైమ్‌రేట్ పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఐటీ రంగం అద్భుత ప్రగతి సాధించిందని చెప్పారు. 2014-15లో రూ.50వేల కోట్లు ఉన్న ఐటీ ఎగుమతులను 2022-23 నాటికి రూ.2.41 లక్షల కోట్లకు చేర్చిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కిందని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనల్లో మార్పు చేయాలని అసెంబ్లీ వేదికగా పోరాటం చేస్తామని, ప్రభుత్వం దిగిరాకుంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని వివేకానంద హెచ్చరించారు.

మొండిగౌరెల్లిలో మళ్లీ డ్రోన్ల కలకలం

- **అర్ధరాత్రి ఆకాశంలో జోరుగా సంచారం**
- **వరుసగా గ్రామాన్ని జల్లెడ పట్టిన డ్రోన్లు**
- **భయాందోళనలో ప్రజలు, రైతులు**



మొండిగౌరెల్లి అర్ధరాత్రి ఆకాశంలో తిరుగుతున్న డ్రోన్

యాచారం, మార్చి 20: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మొండిగౌరెల్లిలో మరోసారి డ్రోన్లు జోరుగా సంచరించడంతో అధికారులు భూముల సర్వేను గుట్టుచప్పుడు కాకుండా ప్రారంభించారని గ్రామస్తులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి మొండిగౌరెల్లిలో ఐదారు డ్రోన్‌లు గాల్లో తిరగడాన్ని గ్రామస్తులు సెల్‌ఫోన్లలో బంధించారు. ఇటీవలే మొండిగౌరెల్లిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం ప్రభుత్వం 821.11ఎకరాల భూసేకరణకు శ్రీకారం చుట్టింది. దీనికోసం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామస్తులు నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆందోళనలకు దిగుతున్న విషయం తెలిసిందే, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వమే రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా డ్రోన్‌ల ద్వారా భూముల సర్వే కొనసాగిస్తున్నదని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఆరు నెలల క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద, చింతపట్ల, ధర్మన్నగూడ, మొండిగౌరెల్లి, తులేఖుర్దు తదితర గ్రామాలలో డ్రోన్లు తిరిగిన విషయం తెలిసిందే. మొండిగౌరెల్లి గ్రామంలో డ్రోన్లు సంచరించడంతో గామస్తులు మండిపడుతున్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా భూములు ఇచ్చేదిలేదని తెగేసి చెబుతున్నారు.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి తాత్కాలిక ఊరట

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఐపీఎస్ అధికారి అభిషేక్ మహంతి ఏపీ క్యాడర్‌లో బాధ్యతలు స్వీకరించాలని కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల అమలును హైకోర్టు ఈ నెల 24వ తేదీ వరకు నిలిపివేస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా మహంతిని తెలంగాణ క్యాడర్లోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 171ను పరిగణనలోకి తీసుకున్నారో లేదో చెప్పాలని కేంద్రాన్ని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర అభ్యర్థనను కేంద్ర హోం శాఖ తిరస్కరించింది. ఏపీ క్యాడర్‌లో చేరాలని ఉత్తర్వులు జారీచేసింది. వీటిని అభిషేక్ మహంతి క్యాట్‌లో సవాల్ చేయగా ఉపశమనం లభించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ ఈ తిరుమలాదేవితో కూడిన ధర్మాసనం పైవిధంగా మధ్యంతర ఉత్తర్వులను జారీచేసింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

'వకుళాభరణం'కు లోహియా పురస్కారం

23న ఢిల్లీలో ప్రదానం

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలిసారిగా అందివ్వనున్న డాక్టర్ రామ్ మనోహర్ లోహియా సామాజిక న్యాయ పురస్కారానికి బీసీ కమిషన్ మాజీ చైర్మన్, బీసీ ఉద్యమకారుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఎంపికయ్యారు. ఈ మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఆదినారాయణ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. లోహియా జయంతిని పురస్కరించుకొని జాతీయస్థాయిలో ఈ అవార్డును అందిస్తున్నట్టు తెలిపారు. సామాజిక న్యాయం, బీసీ హక్కుల సాధన కోసం వకుళాభరణం చేస్తున్న కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్టు వెల్లడించారు. ఈ నెల 23న ఢిల్లీలోని రాజా రామ్మోహన్‌రాయ్ మెమోరియల్ హాల్‌లో ప్రశంసాపత్రంతోపాటు రూ.1.15 లక్షల నగదు పురస్కారం, జ్ఞాపిక అందించనున్నట్టు వివరించారు.

ఫ్యూచర్ సిటీ రోడ్డు టెండర్‌కు బ్రేక్

మొదటిపేజీ తరువాయి...

జారీచేశారు. ఈ భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాకముందే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణం కోసం టెండరు నోటీసు జారీ చేశారని తెలుపుతూ శిల్ప రియల్ వ్యాల్యూ ప్రాపర్టీస్ సహా 9 పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బీ విజయ్‌సేన్‌రెడ్డి ఇటీవల విచారణ జరిపారు. ప్రతివాదులైన హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్, రంగారెడ్డి కలెక్టర్లకు నోటీసులు జారీచేశారు. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేశారు.

విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణానికి హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్‌లు టెండరు నోటిఫికేషన్ జారీ చేశాయని చెప్పారు. రోడ్డు నిర్మాణం కోసం గత ఏడాది అక్టోబర్ 28న భూసేకరణ చట్టం సెక్షన్ 11 కింద ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసిన అధికారులు ఆ ప్రక్రియపై అభ్యంతరాలు కూడా స్వీకరించలేదని తప్పుపట్టారు. సెక్షన్ 15 కింద భూయజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, కానీ దానిపై ఎలాంటి నోటిఫికేషన్ జారీచేయలేదని అన్నారు. సెక్షన్ 15 కింద నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యాక సెక్షన్ 19 కింద డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ఇవేమీ లేకుండా ఫ్యూచర్ సిటీరోడ్డు టెండర్లకు నోటిఫికేషన్ జారీ చేయడం చెల్లదని వివరించారు. ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యాకే ఫ్యూచర్ సిటీ రోడ్డు టెండరు ప్రక్రియ ప్రారంభం కావాలని స్పష్టంచేశారు. ఒకసారి ఫ్యూచర్ సిటీ రోడ్డు టెండరు ఖరారైతే తమతో పాటు ఇతర రైతులు వ్యక్తం చేసే అభ్యంతరాలకు విలువ లేకుండాపోతుందని అన్నారు. చట్ట ప్రకారం అధికారులు అభ్యంతరాలను స్వీకరించినా ఆ తరువాత వాటిని తిరస్కరిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ సిటీ రోడ్డు టెండరు ప్రక్రియను నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. వాదనల తర్వాత హైకోర్టు, ఫ్యూచర్ సిటీ రోడ్డు టెండర్ ప్రక్రియపై యథాతథస్థితిని కొనసాగించాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది.